ప్రజాశక్తి

బుధవారం 23 ఏప్రిల్ 2025 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆటో కార్మికులు, నేతలు



ఓలా, ఊబర్, రాపిడో యాప్‌లకు వ్యతిరేకంగా

కదంతొక్కిన ఆటో కార్మికులు

● విజయవాడలో ఆటోలతో భారీ ర్యాలీ ● వందలాది మంది నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం విజయవాడలో ఆటో కార్మికులు కదంతొక్కారు. ఓలా, ఊబర్, రాపిడో తదితర బడా కంపెనీల యాప్‌లను నిషేధించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. బిఆర్‌టిఎస్ రోడ్డులో వందలాది ఆటోలను నిలిపివేసి నిరసన తెలిపారు. భానునగర్ నుండి ఫుడ్ జంక్షన్ వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం ఫుడ్ జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ జరిగింది. ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా కంపెనీల మోసపూరిత చర్యలపై ఆటో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మికుల గొంతు కోస్తూ బడా సంస్థలకు మద్దతు తెలపటం పట్ల నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనూడి కాశీనాథ్, కార్యదర్శి కార్యదర్శి కె.దుర్గారావు తదితరులు మాట్లాడారు. ఆటో కార్మికుల ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు, కాశీనాథ్, దుర్గారావు మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడో తదితర బడా సంస్థలు యాప్‌ల పేరుతో ఓవైపు ప్రయాణీకులను, మరోవైపు ఆటో కార్మికులను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈ సంస్థల యాప్‌లోలేని ఆటో కార్మికులకు కిరాయిలు లేకుండా చేస్తున్నాయన్నారు. పెట్రోలు, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ రేట్లు, బీమా ఇతర ఖర్చులతోపాటు భారీగా జరిమానాలు పెరిగిపోవడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బడా సంస్థలు పోటీ పడుతూ ప్రయాణీకులను ఆకర్షించడానికి మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్లాట్‌ఫారం ఫీజు, కమీషన్ల పేరుతో ఆటో కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని, ఇష్టారాజ్యంగా కార్మికుల ఆదాయంలో కోత పెడుతున్నాయని చెప్పారు. ప్రయాణీకులకు రాయితీలు ఇస్తున్నట్లు మోసపూరిత ప్రకటనలు చేస్తూ మార్కెట్ మొత్తాన్ని కబళించడానికి తీవ్ర ప్రయత్నాలు (మిగతా 2లో)

వడదెబ్బ

● 50 రోజుల్లో 70 మందిబాధితులు
● అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ సూచన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వేసవి ఎండల తీవ్రత క్రమేణా పెరుగుతోంది. దీంతో వడదెబ్బ బాధితులు పెరిగిపోతున్నారు. కృష్ణాజిల్లాలో గల 50 రోజుల్లో 70 మంది వడదెబ్బకు గురయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వడదెబ్బకు గురై మరణాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది వాతావరణం భిన్నంగా ఉంది. ఫిబ్రవరి చివరివారం నుంచి ఎండలు మొదలయ్యాయి. మార్చి చివరి వారంలోనూ, ఏప్రిల్ మొదటి వారంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. ఏప్రిల్ మూడో వారంలో ఎండ తీవ్రత స్వల్పంగా పెరిగింది. ఉక్కపోత వాతావరణం నెలకొంది. జిల్లాలో 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చి 1 నుండి ఏప్రిల్ 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 70 మంది వడదెబ్బకు గురయ్యారు. రాబోయే రోజుల్లో ఏప్రిల్ చివరి వారంలోనూ., మేలోనూ ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు ఇలా

వేసవిలో ఎండలు, ఉక్కపోత వాతావరణంలో శరీరంలోని లవణాలు, పొటాషియం, సోడియం తదితరమైనవి చెమట ద్వారా ప్రజలు ఎక్కువగా కోల్పోతారు. దీని కారణంగా వడదెబ్బకు గురైన వారిలో తొలుత మొఖం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. జ్వరం, కండరాల నొప్పులు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య తీవ్రమైతే ఫిట్స్‌కు గురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా

వేసవిలో ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండల్లో తిరగడాన్ని మానుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే సూర్యరశ్మి నేరుగా శరీరానికి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గొడుగు, పలుచటి లేతరంగు దుస్తులు ధరించాలి. మంచినీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి. డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీరు, కొబ్బరినీళ్లు, చక్కర లేని పండ్ల రసాలు, ఒఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలి. ఎండలో నుంచి ఇంటికి వెళ్లగానే చల్లని నీటితో కాళ్లు చేతులు, మొఖం కడుక్కోవాలి.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలపై అవగాహన
ఎస్.శర్మిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ఎండ తీవ్రత తగ్గిన తర్వాత ఉపాధి పనులు చేయాలని కార్మికులకు సూచించాం. ఉపాధి పనులకు వెళ్లే కార్మికులకు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు రోజువారీ పంపిణీ చేస్తున్నాం. ఐదు లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. వడదెబ్బ నియంత్రణకు ఆయా ప్రభుత్వ శాఖల్లో తీసుకోవాల్సిన చర్యలను సూచించాం.

బెంగళూరులో విఎంసి బృందం

ప్రజాశక్తి - విజయవాడ : బృహత్ బెంగళూరు మహానగర పాలికే (గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్) లో జరుగుతున్న అభివృద్ధి పనులను విజయవాడ నగర పాలక సంస్థ కార్పొరేటర్ల బృందం మంగళవారం పరిశీలించింది. బిబిఎంసిలో గల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విజయవాడ కార్పొరేటర్లకు చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆహ్వానం పలికారు. బెంగళూరులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సవాళ్లు, కార్పొరేషన్ స్థితి గతులను వివరించారు. ముందుగా వైసిపి ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లను పరిచయం చేస్తూ, విజయవాడ నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజలకు అందిస్తున్న సేవలను వారికి వివరించారు. ఈ సందర్భంగా తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ 225 చదనపు కిలోమీటర్లతో మొదలైన బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుతం 700 చదనపు కిలోమీటర్లకు విస్తరించిందని, 1.41 కోట్ల జనాభా కలిగి ఉందని, 8 జోన్లలో అభివృద్ధి చెందిందని తెలిపారు. 25 నుండి 30 సంవత్సరాల వరకు ఏవిధమైన నిర్వాహణ ఖర్చు లేకుండా ఉండేలా వైట్ టాప్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని, ప్రస్తుతం 200 కిలోమీటర్ల వరకు వైట్ టాప్ రోడ్లు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని చెప్పారు. మురుగునీటి పారుదలకు సంబంధించి కె 100 ప్రాజెక్ట్‌ను చేపడుతున్నారని, కోరమంగళ వ్యాలీ నుండే మొదలై 100 కిలోమీటర్ల వరకు స్టామ్ వాటర్ డ్రైన్లతో ప్రాజెక్ట్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 11 కిలోమీటర్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సహజ పద్ధతిలో స్టామ్ వాటర్ డ్రైన్‌లో కాలుష్యాన్ని కాల్వల్లో పెరిగే మొక్కల ద్వారా తగ్గిస్తూ నీటి శుద్ధి చేస్తున్నామని, కేవలం వర్షపు నీటి డ్రైన్ మాత్రమే కాకుండా పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామని చెప్పారు. దేశంలోనే క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహణలో బెంగుళూరు 3వ నగరంగా ఉందని, దీనిలో భాగంగా పర్యావరణం, సరస్సులు, అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. బెంగళూరు మహా నగరంల వ్యర్థాలు, రోడ్లు, లైటింగ్, సరస్సు వంటి నాలుగు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ఇంటిగ్రేటెడ్ (మిగతా 2లో)



బెంగుళూరులో విఎంసి బృందం

సెంట్రల్ జిఎస్‌టి నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక


ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని సెంట్రల్ వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ మంగళవారం గుంటూరు కన్నావారితోటలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



పశ్చిమ గోదావరి నుండి నెల్లూరు వరకు ఐదు జిల్లాల పరిధిలో సెంట్రల్ జిఎస్‌టి కమిషనరేట్ విస్తరించి ఉంది. నూతన కమిషనర్ సుజిత్ మల్లిక్ భువనేశ్వర్ నుండి గుంటూరుకు ప్రమోషన్‌పై వచ్చారు. ఆయన 1997-2001లో రూర్కెలాలోని ఆర్ఇసి (ప్రస్తుతం ఎన్ఐటీ) నుండి బీఈ (మెకానికల్ ఇంజినీరింగ్)ను పూర్తి చేశారు. ఒడిశా ఆంగుల్‌లో నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్‌లో పనిచేశారు. 2007లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్‌ఎస్)లో చేరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కొటిక్స్ (నాసెన్), ఫరీదాబాద్‌లో ప్రొబేషన్ ట్రైనింగ్ పూర్తి చేసిన అనంతరం ఆయన.. మొదటి పోస్టింగ్ కోల్‌కతాలోని ఎయిర్ కార్గో కాంప్లెక్స్, ఎన్ఎస్సీబీఐ ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరారు. అక్కడ ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, ఎస్ఐఐబీ, డ్రాబ్యాక్ వంటి విభాగాలను చూశారు.

ఎదురుమొండి దీవుల్లో పర్యటిస్తున్న ఆసియా బ్యాంక్ ప్రతినిధులు



ఎదురుమొండి దీవుల్లో ఆసియా బ్యాంక్ ప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి - నాగాయలంక : ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ (ఎఐఐబి) అబుదాబీ, చైనా ప్రతినిధులు మంగళవారం కృష్ణాజిల్లా నాగాయలంక మండలం ఎదురుమొండి దీవుల్లో పర్యటించారు. ఎదురుమొండి - గొల్లమంద రోడ్డు సమస్యను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో దీవుల ప్రజలు ఎఐఐబి ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. అనంతరం పులిగడ్డలోని ఇరిగేషన్ శాఖ అతిథి గహంలో అవనిగడ్డ ఎంఎల్ఎ బుద్ధప్రసాద్‌తో సమావేశమై పర్యటన విశేషాలు వివరించారు. వారిని ఎంఎల్ఎ సత్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణానది ప్రవాహ వేగానికి ఎదురుమొండి - గొల్లమంద రోడ్డు క్రమేపీ కోతకు గురైన నేపథ్యంలో ఈ సమస్యను డ్రోన్ షూటింగ్ ద్వారా వీడియో తీయించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయన వెంటనే స్పందించి ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ నిధులు రూ.13.45 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ఎదురుమొండి - గొల్లమంద మధ్య భూ సమీకరణతో రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. త్వరలో ఈ రోడ్డు సాకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఐబి ప్రాజెక్టు టీమ్ లీడర్ పవన్ కార్కీ, బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ అశోక్ కుమార్, శివరామకష్ణ, యోగీష్, మాయా, లార్లా, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



లిబరేషన్ పార్టీ నాయకులు శేషగిరి మృతి

ఎయిమ్స్‌కు భౌతికదేహం అప్పగింత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, విశ్రాంత అధ్యాపకులు ఆరేపల్లి శేషగిరిరావు (69) బ్రెయిన్ సంబంధ అనారోగ్యంతో మొఘల్‌రాజపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికదేహాన్ని గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు సందర్శనార్థం ఉంచి సంతాపసభ నిర్వహించారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌కు ఆయన భౌతికదేహాన్ని వైద్య విద్య పరిశోధన నిమిత్తం మంగళవారం అందజేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నాగమణి మహిళా సంఘం రాష్ట్ర నాయకులుగా బాధ్యతల్లో ఉన్నారు. శేషగిరి గాంధీనగర్‌లో ఉన్న ఎస్‌కెపివి హిందూ హైస్కూల్‌లో తెలుగు భాష అధ్యాపకులుగా చేశారు. లిబరేషన్ పార్టీ కష్ణాజిల్లాలో వ్యవస్థాపకులుగా పార్టీలో కీలకంగా వ్యవహరించారు. శేషగిరిరావు మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

రూ.10 లక్షల విలువైన 22 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ : ఎలక్ట్రికల్ బైక్‌ల దొంగతనం కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన 22 ఎలక్ట్రికల్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మాచవరం ఇఎస్‌ఐ ఆస్పత్రి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, రెండు ఎలక్ట్రికల్ బైక్‌లపై ముగ్గురు వ్యక్తులు వెళుతూ పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోనికి తీసుకుని విచారించి వారి వద్ద నుండి బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. నిందితులు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంనకు చెందిన షేక్ బాషా, ఉండికి చెందిన జక్కంశెట్టి దుర్గాప్రసాద్, విజయవాడ వాంబే కాలనీకి చెందిన సయ్యద్ యూసఫ్‌గా గుర్తించారు. ముగ్గురు నిందితులు ఐదు నెలల్లో ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, కైకలూరు, తాడేపల్లి, విజయవాడ ప్రాంతాల్లో సుమారు రూ.10 లక్షల విలువైన 22 ఎలక్ట్రికల్ బైక్‌లను దొంగిలించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన మాచవరం సిఐ, ఎస్ఐ, వారి సిబ్బందిని అధికారులు అభినందించారు.



కదంతొక్కిన ఆటో కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయని తెలిపారు. తొలుత రాయితీలు ఇస్తున్నట్లు కనిపించినా భవిష్యత్తులో అటు ప్రయాణీకులను, ఇటు కార్మికులను దోచుకుని బడా కంపెనీలు తమ ఖజానా నింపుకోవడానికి కుట్రలు పన్నుతున్నా యన్నారు. ఎటువంటి చట్టాలు, నిబంధనలు పాటించకుండా ఈ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, ప్రభుత్వాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉపాధి పేరుతో ఈ బడా కంపెనీలతో (రాపిడో) ఒప్పందాలు చేసుకోవటం శోచనీయమన్నారు. రూ.100 జరిమానాను రూ.1000కి పెంచడం దుర్మార్గమన్నారు. జీవో నెంబర్ 21 పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆటోలు, మోటార్ సైకిళ్లు, ఇతర వాహనాలపై భారీగా జరిమానాలు విధించడం అన్యాయమన్నారు. వాహన మిత్ర పథకం కింద ఇచ్చే రూ.10 వేలను రూ.15 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి పది నెలలైనా నోరు మెదపటం లేదన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు ఎం.హనుమంతరావు, బి.రూబేన్ కుమార్, ఎస్‌డి.కరీముల్లా, ఎస్‌కె.దుర్గావళి, డి.కోటయ్య, పి.తిరుపతయ్య, రాఘవ, విజ్జి భాస్కర్, ఎ.వి.రెడ్డి, అనిల్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రల పేరుతో నిధులు దుర్వినియోగం

సిపిఎం రాష్ట్ర నాయకులు కాశీనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : నగరాభివృద్ధి, ప్రజల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసి విజ్ఞాన యాత్రల పేరుతో, ల్యాప్‌ట్యాప్‌ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వైసిపి, టిడిపి కార్పొరేటర్లు దుర్వినియోగం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. ఆపార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి మంగళవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో కాశీనాథ్ మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల వైసిపి పాలనా కాలంలో ఇప్పటి వరకు మూడు పర్యాయాలు విజ్ఞాన యాత్రల పేరుతో రూ.2.48 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. కానీ ఈ యాత్రలతో నగరానికి, ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తూ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల పరిధిలో విజ్ఞాన యాత్ర పేరుతో రూ.78.50 లక్షలు బడ్జెట్‌లో కేటాయించుకున్నారని తెలిపారు. అలాగే 2025-26లో యాత్రకు రూ.82 లక్షలు, మొదటి యాత్రకు రూ.40 లక్షలు, ఆ తర్వాతి యాత్రకు రూ.47 లక్షలు ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టారని తెలిపారు. ప్రజలు వివిధ పన్నుల ద్వారా చెల్లించిన సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఖాళీ ఖజానా, ఆగిపోయిన అభివృద్ధి పనులు, కనీసం కార్మికులకు వేతనాలు ఇవ్వలేక, ఆస్తి పన్ను, నీటి ఛార్జీలు, విద్యుత్ భారాలు ఇలా వివిధ రకాల పన్నుల భారాలు మోపుతూ, మంచినీటి ఎద్దడి, అధ్వానంగా ఉన్న పారిశుధ్య నిర్వహణ, దోమల బెడద, అస్తవ్యస్తంగా పాలనా, అధికారుల కొరత ఇలా అనేక సమస్యలతో నగర పాలక సంస్థ పాలన అధ్వానంగా తయారైందన్నారు. విజ్ఞాన యాత్రకు వైసిపి, టిడిపి, జనసేన, బిజెపికి చెందిన 43 మంది కార్పొరేటర్లు వెళ్లారని పేర్కొన్నారు. గతంలో చేసిన యాత్రల వల్ల ఎటువంటి ప్రయోజనం కలగలేదని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కావాల్సిన వందల కోట్ల గ్రాంట్లు, ఇతర నిధుల కోసం ఆయా ప్రభుత్వాల వద్దకు వెళ్లి అడిగే ధైర్యం, చిత్తశుద్ధి టిడిపి, బిజెపి ప్రజాప్రతినిధులకు, ఆయా పార్టీల కార్పొరేటర్లకు లేదని విమర్శించారు. తమ పార్టీ కార్పొరేటర్ బోయి సత్యబాబు ఈ విజ్ఞాన యాత్రకు వెళ్లేందుకు నిరాకరించడంతోపాటు విలువైన ల్యాప్‌ట్యాప్‌ను కూడా తీసుకోలేదని తెలిపారు. ప్రజల తరుపున పని చేసేందుకు తమ పార్టీ కార్పొరేటర్ కౌన్సిల్‌కు వెళ్లారే తప్ప ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసేందుకు కాదని అన్నారు. బోయి సత్యబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌కు సంబంధించి రూ.289 కోట్లు, ఎపి గ్రాంట్స్ రూ.130 కోట్లు... ఇలా వందల కోట్లు విఎంసికి ఇవ్వాల్సి ఉందని, ఎపి సచివాలయం వద్దకు వెళ్లి సిఎం, డిప్యూటీ సిఎంలను అడిగే సమయం లేదు కానీ...15 రోజులపాటు యాత్రల పేరుతో మూడు రాష్ట్రాల్లో పర్యటనకు వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిని ప్రజలు గమనించి, నిలదీయాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న కాశీనాథ్, చిత్రంలో సత్యబాబు

సాంఘిక బహిష్కరణ సిగ్గు చేటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పిఠాపురం మండలం మల్లంగ్రామంలో దళిత యువకుడు కరెంట్ షాక్‌తో చనిపోతే న్యాయం చేయాలని అడిగినందుకు దళితులను సాంఘిక బహిష్కరణ చేయటం సిగ్గు చేటని ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో ఇలా జరగడం బాధాకరమని పేర్కొన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. కొంత మంది పవన్ కళ్యాణ్‌ను చూసి ఏంచేసినా పరవాలేదనుకుంటున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి75 సంవత్సరాలైనా ఇలాంటి సంఘటనలు జరగటం బాధాకరమని తారక ప్రసాద్ అన్నారు. బాధ్యులను శిక్షించకుండా శాంతి కమిటీలను వేయడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. వెంటనే ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి, హోమంత్రి స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎకెటిపిఎం విద్యార్థుల ర్యాలీ

విజయవాడ : సత్యనారాయణపురంలోని విజయవాడ నగరపాలక సంస్థ ఎకెటిపిఎంసి ఉన్నత పాఠశాలలో మంగళవారం హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు.. "ప్లాస్టిక్ వాడడం తగ్గించండి... భూమిని కాపాడండి" నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్.శివ, రాధిక, అశ్విని, హెప్సిబా, ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు.



పాత్రికేయుల సొసైటీ స్థలంలో కార్యాలయ గది

- సభ్యుల విజ్ఞప్తికి కలెక్టర్ అంగీకారం
- సమస్యను సీఎం దష్టికి తీసుకెళ్తా : యార్లగడ్డ

విజయవాడ : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్' స్థలంలో సొసైటీ కార్యాలయంగా ఓ గది నిర్మించుకోడానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అనుమతించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రూరల్ మండల తహశీల్దార్ సుగుణ ఆధ్వర్యంలో సొసైటీ స్థలంలోని ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశను సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు పలువురు కలిసి ధన్యవాదాలు తెలిపారు. హౌసింగ్ సొసైటీ స్థలం తిరిగి దురాక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లను త్వరలోనే కలిసి సమస్యను వారి దష్టికి తీసుకెళ్తామని ప్రభుత్వ విప్ యార్లగడ్డ చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు చిగురుపాటి సతీష్ బాబు నేతత్వంలో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.



బెంగళూరులో విఎంసి బృందం

(మొదటి పేజీ తరువాయి)

కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి గాలి నాణ్యత సరస్సుల్లో నీటి సాంద్రత, వెహికల్ ట్రాకింగ్ వంటి అంశాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం విఎంసి డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజ రెడ్డి, వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మిడి వెంకటేశ్వరావు, బిజెపి కార్పొరేటర్ బుల్లా విజయకుమార్‌ను చీఫ్ కమిషనర్ సన్మానించారు. అలాగే విఎంసి తరపున చీఫ్ కమిషనర్‌ను సత్కరించారు.

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు తిలోదకాలు

- నాగలక్ష్మి సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాల వల్ల జనం సమస్యల్లో కూరుకుపోతున్నారని, వాటి పరిష్కారానికి రానున్న రోజుల్లో పోరాటాల్లోకి రావలసిన ఆవశ్యకత పెరుగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. మండలంలోని ముస్తాబాద్ మర్రి చెట్టు సెంటర్లో సిపిఎం నాయకురాలు వై. నాగలక్ష్మి సంతాప సభ జరిగింది. నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు తిలోదకాలు ఇస్తున్నారని, అంతటితో ఆగకుండా ప్రజలపై భారాలు మోపే పనిలో ఉన్నారని దుయ్యబట్టారు. బిజెపి ప్రభుత్వం మరింత దూకుడు పెంచి రైతులు కార్మికుల జీవితాలతో ఆటలు ఆడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రశ్నించాల్సిన కూటమి ప్రభుత్వం మోడీ అడుగులకు మడుగు లొత్తుందని విమర్శించారు. కరెంటు భారాలు, గ్యాస్ ధరలు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో జనం బతకడం కష్టమవుతుందన్నారు.



రోజువారి పనులు చేసుకునే కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందన్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో ప్రజలను పోరాటాల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత ఎర్రజెండా నాయకులపై ఉందన్నారు. నాగలక్ష్మి తన జీవితమంతా ఎర్రజెండా నీడలో పనిచేసే ప్రజా సమస్యలపై తనదైన శైలిలో ముందుకు సాగారని కొనియాడారు. పోరాటాలను ఉదతం చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పల్లె సుద్దులు అనే నాటికను కొండబాబు, ఆంజనేయులు, రవిబాబు లు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు కే.వెంకటేశ్వరరావు, కైలే ఏసుదాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో చోరీ



సీసీ ఫుటేజ్ లో దొంగలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి లోని సుందరయ్య కాలనీలో మాదల కృష్ణ ఇంట్లో సోమ వారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 20 వేలు నగదు,1 మొబైల్ ఫోన్ ను అపహరించి తీసుకుపోయారు. బాధితుడు గన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసుల రంగంలోకి దిగారు. ఆ ఇంటికి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ లను తీసి దొంగల వివరాలు ఆరాధిస్తున్నారు.

న్యాయమూర్తి బదిలీ

ప్రజాశక్తి మొవ్వ :మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ పి రాజన్‌ఉదయ్ ప్రకాష్ కడప జిల్లాలోని రాజంపేటలో న్యాయ స్థానానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందాయి. 2022వ సంవత్సరంలో మొవ్వ న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఆయన విచ్చేశారు. కృష్ణా జిల్లాలోనిమొవ్వలో ఏర్పాటుచేసిన ఈ న్యాయస్థానానికి రెండవ న్యాయమూర్తిగా పలు సేవలందించారు.



బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం చిలకలపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిదిలోని బడిఈడు పిల్లలను స్థానిక ప్రభుత్వ బడిలో చేర్చాలని కోరుతూ యం.ఇ.ఓ -1 యన్.శివశంకర రావు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యం.ఇ.ఓ -1 స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయని కె.రత్నజ్యోతి, సహచర ఉపాధ్యాయుడు జి.భగవాన్ తో కలసి బడి ఈడు ఉన్న పిల్లల ఇళ్ల ను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలు ఇచ్చే ఉచిత వసతులును వినియోగించుకుని, పిల్లలకు మెరుగైన విద్య నేర్పుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను యం ఈ ఓ 1 కోరారు.

ఐక్యం ఫౌండేషన్ సహకారం అభినందనీయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఐక్యం ఫౌండేషన్ వారి సహకారంతో 30 మంది ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ ప్రొటెక్షన్ కిట్లు, అక్షయ ఫ్యాషన్ అక్సెసరీస్ వారు పోలీస్ వారి విధులకు ఉపయోగపడే పరికరాలను అందజే యడం అభినందనీయం అని బందరు డిఎస్పి సిహెచ్ రాజా పేర్కొన్నారు. వేసవికాలం కారణంగా ఎండలు తీవ్రతరం అవుతున్న దష్ట్యా , ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించే క్రమంలో సిబ్బంది మండుటెండలో విధులు నిర్వహిస్తుండగా వారి సంక్షేమం దష్టిలో పెట్టుకొని, సామాజిక బాధ్యతగా ఐక్యం ఫౌండేషన్ వారి సహకారంతో సమకూర్చిన 30 సమ్మర్ ప్రొటెక్షన్ కిట్లను బందరు డిఎస్పి సిహెచ్ రాజా ట్రాఫిక్ సిఐ ఏ.వి శివకుమార్‌తో కలిసి మంగళవారం బందరు ట్రాఫిక్ సిబ్బందికి అందించారు. ఐక్యం ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆకూరి శ్వేత, సభ్యులు, ట్రాఫిక్ ఎస్ఐ లు ఎస్.వెంకటేశ్వరరావు, టి. మధుసూదన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మర్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో ముస్లిం సోదరులు శాంతి ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మోదీ అమిత్ షా నాయకత్వం లోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులు కాపాడుతాం, ముస్లిం నిరుపేదలకు మంచి చేస్తాం అంటూనే వక్ఫ్ ఆస్తులను ప్రవేట్ కార్పోరేట్ శక్తులకు ధారాదత్తం చేసే విధంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. గుడ్లవల్లేరు పాత మండల ఆఫీస్ నుండి ప్రధాన రహదారిపై శాంతి ర్యాలీ కొనసాగింది. ప్రధాన సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మండల ఆఫీస్ వరకు శాంతియుత నిరసన ప్రదర్శన



ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ లోకరాజుకు వినతి పత్రాన్ని అందించారు. ముస్లిం సమైక్య వేదిక నాయకత్వం లో జరిగిన కార్యక్రమం లో మత పెద్దలు, సామాజిక సేవా సంఘాల వారు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు .

ఆర్‌టిసి బస్సులను కోనేరు సెంటర్ మీదుగా నడపాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం డిపో నుండి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ కోనేరు సెంటర్ మీదుగా నడపాలని మచిలీపట్నం పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొడాలి శర్మ ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం మచిలీపట్నం ఆర్టీసీ డిపో వద్ద మచిలీపట్నం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ నుండి వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ కోనేరు సెంటర్ మీదుగా నడిపి ప్రజల అసౌకర్యాన్ని తొలగించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు చంద్రపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొడాలి శర్మ మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం బందర్ డిపో నుండి విజయవాడకు వెళ్లేందుకు గతం వలే కాక బందరు బైపాస్ మీదుగా ముడుస్తంభాల నుండి విజయవాడ వెళ్లే లాగా యాజమాన్యం నిర్ణయించడం వలన ప్రజానీకం చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులు యధాతరంగా కొనేర్ సెంటర్ మీద విజయవాడ వైపు



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

సర్వీస్ ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం పోలినాయుడు, కష్ణా జిల్లా బిల్లింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వి. గోపాల రావు, ఎల్ఐసి ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కుమార్, ప్రజా ఆరోగ్య సంస్థ కన్వీనర్ పి. నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



చెరుకు పంట పరిశీలన

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తలు డా. సుధా రాణి, డా. రేవతి ఘంటసాల మండలం లోని దేవరకోట గ్రామంలో చెరుకు పంటను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం చెరుకు జడలు కట్టే దశకు చేరుకుందని, ఈ సమయంలో కాండం తొలుచు పురుగు ఉనికిని మరియు ఉధతిని గమనించుకోవడానికి లింగాకర్షక బుట్టలను అమర్చుకుని పురుగు ఉధతిని అంచనా వేసుకోవాలని సుధా రాణి రైతులకు వివరించారు. పురుగు నివారణకు వేప సంబంధిత మందులను పిచికారి చేసుకోవాలని, తద్వారా వికర్షకంగా పని చేసి ఉధతిని అదుపులో ఉంచుతుందని తెలిపారు. ఉధతి అధికంగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రా లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలుపుకుని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమములో ఆదర్శ రైతు రత్నగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

కెయులో ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యా లయం లో ధరిత్రి దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్సీసీ క్యాడెట్లు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం,స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ డా. డి. రామ్ శేఖరరెడ్డి రోజువారీ జీవితం లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలనీ, ప్రతి ఏడాది కనీసం ఒక మొక్క నాటి, దాని పెంపకాన్ని చూసుకోవాలన్నారు.

కుల బహిష్కరణ సిగ్గుచేటు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయటం తీవ్ర నేరంగా పరిగణిస్తూ ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి వారి పై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏఐడిఆర్ ఎఫ్ సఫాయి కర్మచారి లేబర్ ఏపీ స్టేట్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.ఎల్ నారాయణ మంగళవారం ఓ పత్రికా ప్రకటన లో డిమాండ్ చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేటం ఉగ్రవాద చర్య అని నారాయణ అన్నారు. అభివద్ధి చెందుతున్న సమాజంలో ఇంకా దళితుల పట్ల చిన్న చూపు కుల బహిష్కరణలు వంటివి జరగడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం లో దళితుల బహిష్కరణ జరగడం దానికి ఆయన బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు ప్రధాన సెంటర్లో మంగళవారం సాయంత్రం ఎస్ ఐ చాణిక్య ఆధ్వర్యంలోకాగితాలు లేని వాహనా లకు చలానాలు విధించారు. అలాగే మోటరు వాహనాలపై పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్ లో వాహనాల మీద ఉన్న పెండింగ్ చలనాలు పరిశీలించి, పెండింగ్ చలానాలు ఉన్న వాహన యజమానులు, మీసేవ కేంద్రం ద్వారా ఫోన్ పే లా ద్వారా వెంటనే చలానాలు కట్టించారు.ఈ తనిఖీలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

24న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24 తేదీన కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నాని జయప్రదం చేయలని కృష్ణాజిల్లా బిల్డింగ్ అండ్ అధర్ కనస్రటక్షన్ వర్కర్స్ యునియన్ జిల్లా కార్యదర్శి కె.వి. గోపాలరావు పిలుపు నిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో గోపాలరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దిస్తామని కూటమి ప్రభుత్వ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, బొడ్డు వెంకన్న మహమ్మదీ షేక్ మీర్ అలీ పాల్గొన్నారు.





విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ తాతయ్య

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో డాక్టర్ బి.ఎస్.రావు మెమోరియల్ స్పోర్ట్స్ 2024-25 జోనల్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులకు నాసా ప్రాజెక్ట్ స్టేట్ లెవెల్ 1 అవార్డు వచ్చిన విద్యార్థులకు ఐఎన్‌టిఎస్ లెవెల్-2 బహుమతులు పొందిన విద్యార్థులకు, సెలబ్రేషన్ ఫైనల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈజిఎం మురళీకృష్ణ, ఆర్ఐ టి.వినోద్, ప్రిన్సిపాల్ వంగూరి కృష్ణ, డీన్ కే లక్ష్మి, జోనల్ ప్రైమరీ ఇన్చార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి విజయనిర్మల, పిఈటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాముకాటుకు సర్పంచ్ భర్త మృతి

ప్రజాశక్తి-తిరువూరు: పాము కాటుకు సర్పంచ్ భర్త మృతిచెందిన సంఘటన తిరువూరు మండలం జి.కొత్తూరు గ్రామంలో



మంగళవారం చోటుచేసుకుంది. సర్పంచ్ శీలం వెంకట్రావమ్మ భర్త వైసిపి నాయకుడు శీలం కృష్ణారెడ్డి (52) కోతకు వచ్చిన వరి పొలంలో గేదెలు రాకుండా చూసేందుకు వెళ్లాడు. ఈ సమయంలో పాముకాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జి.కొత్తూరు తరలించారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కొలికపూడి

ఎంఎల్ఎ కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండలంలో తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా పోలిశెట్టి జమలయ్య కు పూలమాలవేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక బి జె ఆర్ నగర్ నందు డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అనంతరం స్థానిక అంగన్వాడి కేంద్రంలోని పిల్లలతో ముచ్చటించి వారికి బిస్కెట్ ప్యాకెట్లను ఇచ్చారు. అనంతరం మాదిగ పేద విద్యార్థుల సహాయక సంఘం 10వ వార్షికోత్సవం లో పాల్గొని మంద కష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బి జె ఆర్ నగర్ వాసులు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మురుగుల ప్రసాద్ వేంపటి వేమన బద్రి గరిమెళ్ళ భాస్కర్ రావు మేస్త్రం రాంబాబు ప్రభాకర్ సుధాకర్ స్టాలిన్ సాంబార్ నాగలక్ష్మి అడప శ్రీనివాసరావు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గంధోత్సవం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ లో 32వ సయ్యద్ ఖాజా షఫీ ఉల్లా హుసేని గంధోత్సవం మేళ తాళాలు మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ పట్టణానికి చెందిన సయ్యద్ సిబ్ఘాతుల్లా హుస్సేనీ, మహారాష్ట్రకు చెందిన రఫిక్ ఆలం హుసేని ముస్లిం కమిటీ సభ్యుల ప్రత్యేక ప్రార్థన నడుమ 32వ గంధోత్సవం చిన్న మసీద్ ఉర్దూ పాఠశాల నుండి నాగరోత్సవం నిర్వహించి పెద్ద మసీదులో సయ్యద్ షా ఖాజా సఫీయిల్లా హుసేని దర్గాకు ప్రత్యేక పూజలతో గంధోత్సవం ఘనంగా నిర్వహించారు.

లిటిల్ బ్రైన్స్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని లిటిల్ బ్రైన్స్ పాఠశాల పదవ వార్సికోత్సవ వేడుకలు మంగళవారం అమ్మ కళ్యాణ మండపం నందు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. వార్సికోత్సవ వేడుకలు సాధారణంగా కాకుండా ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అంశాలను విద్యార్థులకు తెలియ చేయాలనే ఉద్దేశంతో వినూత్నంగా నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న అంశాలతోపాటు, విద్యార్థినుల సమస్యలపై , అలాగే నేడు ఎలక్ట్రానిక్ వినియోగం ముఖ్యంగా సెల్ ఫోన్ వాడకం చిన్నారుల నుండి పెద్దల వరకు పెరిగిందని సెల్ ఫోన్ వాడకం వలన కలిగే దుష్పరిణామాలను విద్యార్థులు చక్కగా పాటలు, నాటిక రూపంలో వివరించిన విధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా శాసన సభ్యులు వై. వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సజనాత్మకతను వెలికి తీసేందుకు లిటిల్ బ్రైన్స్ పాఠశాల కృషి చేస్తుందని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు అన్ని అంశాలపై అవగాహన ఉండే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా నేటి విద్యార్థులు సెల్ ఫోన్ వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై తాము ప్రత్యేక కార్యక్రమాలనుబ్నిర్వహించి విద్యార్థులను సెల్ ఫోన్ కు దూరంగా ఉండేవిధంగా చేస్తున్నామని అన్నారు. అలాగే విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కోర్సు లో మార్పులు చేస్తూ బోధన అందిస్తున్నామని అన్నారు.





వ్యాయామోపాధ్యులు సురేష్ సేవలు అభినందనీయం



వ్యాయామోపాధ్యాయునికి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-భవానీ పురం: సుధీర్ఘ కాలంగా విద్యార్థుల వున్నతి కోసం పాటుపడిన వ్యాయామోపాధ్యులు (పీ ఈ టీ) గద్దె సురేష్ బాబు సేవలు అభినందనీయమని జీ ఎన్ ఆర్ ఎం సి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీవీ రవికుమార్ అన్నారు. గద్దే సురేష్ రామరాజ్య నగర్ లోని జీ ఎన్ ఆర్ ఎం సి ప్రాథమిక పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ పీ.ఈ.టీ గా పనిచేస్తూ ఈ నెలతో ఉద్యోగ విరమణ చేయనున్నారు. వేసవి సెలవులను దష్టిలో ఉంచుకొని మంగళవారం పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ ఉడా చైర్మన్ టీ. ప్రేమ్ నాథ్, ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ బీ. మెహర్ బాబు, మాజీ కార్పొరేటర్ జీ కోటేశ్వరరావు, ఎస్ జీ ఎఫ్ సెక్రెటరీ భానుమూర్తి రాజు తదితరులు పాల్గొని పదవి విరమణ పొందుతున్న గద్దె సురేష్, అతని భార్య శ్రీలక్ష్మి ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా వత్తినే దైవంగా భావిస్తూ, అంకిత భావంతో పనిచేస్తూ ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది పదవి విరమణ పొందుతున్న గద్దె సురేష్ బాబు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పీ ఈ టి గా పనిచేస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి , విద్యార్థులను శారీరకంగా, మానసికంగా, దఢంగా తయారు చేశారన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-విస్సన్నపేట: ఉపాధి హామీ వేతనాలు 13 వారాలుగా కార్మికులకు చెల్లించలేదని రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని మండలంలో ఉపాధి హామీ కి సంబంధించి నాలుగు కోట్లు బకాయి ఉందని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం జిల్లా అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్ ఆర్ జి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఉపాధి హామీ బకాయిలను వెంటనే



చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని బకాయలు వెంటనే లబ్ధిదారులు ఖాతాలకు జమ చేయాలని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మేకల జ్ఞాన రత్నం గద్దల రామకష్ణ పులిబల్ల ఏడుకొండలు పాల్గొన్నారు

మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి



మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: సమాజంలోని ప్రతి మహిళ విద్యావంతురాలై సాధికారత సాధించినప్పుడే సమాజ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీహెచ్ఇఆర్ అండ్ ఎంసి చైర్‌పర్సన్ ఎం.వెంకటరమణ అన్నారు. కేబీఎన్ కళాశాలలో యుజిసి ఉమెన్స్ స్టడీ సెంటర్ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ, వేలాది మంది మహిళలను వివిధ రకాల వత్తి విద్యల ద్వారా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంతో పాటు విద్యావ్యవస్థను వ్యాపార దక్పథంతో కాకుండా సమాజ సేవగా నిర్వహిస్తున్న కేబిఎన్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళ ప్రతి కుటుంబానికి వెన్నెముక అని, మహిళ ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ, దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు తమ కళాశాల పూర్తిగా అండగా ఉంటుందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ, మహిళ ప్రస్తుత సమాజంలో వంటింటి నుంచి అంతరిక్షం దాకా ప్రతి రంగంలోనూ పురుషులను మించి విజయాలు సాధిస్తుందన్నారు. ఇంచార్జి ప్రిన్సిపల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ, వేసవికాలంలో 40 రోజులపాటు మహిళలు చిన్నపిల్లల కోసం 30 రకాల కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉమెన్ స్టడీ సెంటర్ ఇంచార్జి పి.స్వప్న, గౌతమీ దేవి, స్వాతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది శిక్షణ పొందిన పలువురు మహిళలు, విద్యార్థులకు జస్టిస్ రమణ సర్టిఫికెట్లు అందజేశారు.

లెనిన్ జయంతి

ప్రజాశక్తి-తిరువూరు

సిపిఐ ఆధ్వర్యంలో తిరువూరు సుంకర వీరభద్రరావు భవనంలో మంగళవారం లెనిన్155 జయంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నాయకులు నాగుల్ మీరా, మాలపాటి ఉదయ్, షేక్ సుభాని, ఎస్.కె ఫారూఖ్, పల్లపు మురళి పాల్గొన్నారు.

ముగిసిన పోషణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వెలుగు ఆఫీస్ నందు పోషన్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషణ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న మాట్లాడుతూ పోషణ పక్వాడా ముఖ్య ఉద్దేశం గురించి వివరించి కుటుంబ సమేతంగా కలిసి భోజనం చేయటం వలన కలిగే లాభాలను వివరించారు. మండల ఎమ్మార్వో మాట్లాడుతూ పిల్లలలో ఉన్న లోప పోషణ, ఊబకాయం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. మండల ఎంఈఓ మాట్లాడుతూ గర్భవతులు బాలింతల్లో పిల్లలు సీజనల్ ఫ్రూట్స్, కూరగాయలను గురించి వివరించారు. మండల ఎంఈఓ 2 మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమములో సూపర్వైజర్లు జీ రమాదేవి సిహెచ్ మాధవి ఎస్ కే జహీదా బేగం మరియు మండల ఏపీఎం సీసీలు ఎస్ హెచ్ జి వివో ఏ లు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-తిరువూరు

అర్హులైన రైతులకు సబ్సిడీ కింద మంజూరైన ఆధునిక యంత్రాలను తిరువూరు ఎఎంసి కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. ఆధునిక యంత్రాలైన రోటావేటర్లు, కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్లు తదితర పరికరాలు రైతన్నలకు అనేక ఉపయోగాలు ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం దీనిలో దష్టిలో పెట్టుకొని సబ్సిడీ కింద అర్హులైన రైతులకు యంత్రాలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి పద్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- రాత్రైతే చాలు మట్టితోలకాలతో పోటీ పడుతున్న ట్రాక్టర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కన్నెత్తిచూడని అధికారులు



అర్ధరాత్రి మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలంలోని పెదయాదర పంచాయతీ పరిధిలోని చినయాదర గ్రామం నుండి గత వారం రోజులుగా మట్టి మాఫియా విచ్చలవిడిగా మట్టి తోలకాలు సాగిస్తోంది. చినయాదర గ్రామంలోని సుమారు రెండెకరాల పంచాయతీ చెరువులో నుండి ప్రతి రోజూ ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పులు మట్టి తోలి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఏ విధమైన అనుమతులు లేకుండా గ్రామావసరాల నిమిత్తం శ్మశానానికి, బడికి, గుడికని మొదలు పెట్టి ఇష్టారాజ్యంగా మట్టి తోలుతున్నా మైనింగ్,రెవిన్యూ, పంచాయతీ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో సుమారు 20 ట్రాక్టర్ లతో చినయాదర పంచాయితీ నుండి చిన్నాపురం గ్రామంలోకి మట్టితోలకాలు జరిగాయి. పగలంతా విశ్రాంతి తీసుకొని రాత్రి 11 గంటలకు నుండి మట్టి మాఫియా డ్యూటీ ఎక్కుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. వివిపి కాన్వాయి లాగా మట్టితో ట్రాక్టర్లు చక్కర్లు కొడుతుంటే ఆ రోడ్డుపై ప్రయాణించడానికి వాహనచోదకులు భయపడుతున్నారు. గత వారం రోజులుగా చిన్నాపురంలో పలు ప్రేవేటు స్థలాలకు మట్టితోలుచూ ట్రాక్టర్ మట్టి 1000 నుండి 1500 లకు విక్రయిస్తున్నారని సమాచారం. మరి రెవిన్యూ అధికారులు వీరిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారో అనేది ప్రశ్నార్థకం?.

ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదు : వీఆర్వో

గ్రామంలోని చెరువు నుండి మట్టితోలకాలకు రెవిన్యూ పరంగా ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదని వీఆర్వో ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. మొదట స్మశాన అభివద్ధికి కొంత మట్టి అవసరం అవుతుందని అన్నారని, ఇప్పుడు ఈ విధంగా చేస్తున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శి సతీష్ ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

పరీక్షా కేంద్రాల్లో ఉపకులపతి తనిఖీ




ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : యూజి పరీక్షా కేంద్రాలను కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె రాంజీ తనిఖీ చేశారు. మంగళవారం మచిలీ పట్నంలోని ఎస్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల, విజయానంద డిగ్రీ కళాశాల లలో పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో యూజి రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21 నుండి ప్రారంభం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 38 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండవ సెమిస్టర్ పరీక్షలకు 12వేల 203 మంది హాజరుకానుండగా, నాల్గవ సెమిస్టర్ కు 11 వేల 169 మంది హాజరవుతున్నారు.

కెయులో ప్రాంగణ ఎంపికలు

- హెటిరో లాబ్స్‌కు 37 మంది ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : హెటిరో లాబ్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 37 మంది విద్యార్థుల ఎంపిక అయ్యారు. మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయం రవీంద్రనాథ్ ఠాగూర్ సెమినార్ హాలులో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు 96 మంది ఫార్మసీ, రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులు హాజరు కాగా 13 మంది ఫార్మసీ, 24 మంది రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులు ఎంపిక అయ్యారు. తొలుత ప్రాంగణ ఎంపికల కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య కె రాంజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక పరీక్ష కు హాజరయ్యేవారు ఆందోళనకు గురికాకుండా అడిగిన ప్రశ్నకు వెంటనే స్పందించడం అలవాటు చేసుకోవాలన్నారు. రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, రసాయన శాస్త్ర విభాగ అధిపతి డా. సుజాత, డా.కిశోర్, హెటిరో లాబ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ప్రభుత్వం ప్రజలకు శుద్ధి చేసిన సురక్షితమైన మంచినీటిని సరఫరా చేసేందుకు కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మంత్రి మచిలీపట్నం మండలంలోని గుండు పాలెం, వాడపాలెంలలో ఒక్కొక్కటి 13 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 0.50 ఎంఎల్డి మైక్రో ఫిల్టర్లను, కేపిటి పాలెంలో పునరుద్ధరించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీ పట్నం మండలంలో 2.50 కోట్ల రూపాయల వ్యయంతో మైక్రో ఫిల్టర్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేపిటి పాలెం సర్పంచ్ ఒడుగు నాగపోతరాజు , మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు బండి రామకష్ణ పాల్గొన్నారు.



ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉంగుటూరు : జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం, గన్నవరం ఎన్టీఆర్ పశు వైద్యశాల ఇంటర్న్ షిప్ విద్యార్థులు మంగళవారం పెద్ద అవుటుపల్లి లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలు, ఆవులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు నిర్వహించారు, 400 పైగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బాలకష్ణ, డాక్టర్ల లక్ష్మీరాణి, కమలాకర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా ప్రజలు పర్యావరణను పరిరక్షించి ధరిత్రిని కాలుష్యం నుండి కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ పిలుపునిచ్చారు. ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరిత్రీ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఒక పర్యావరణ అవగాహన కార్యక్రమం అన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు మద్దతును తెలియజే యడానికి, ప్రజలలో పర్యావరణ పట్ల అవగాహన కల్పించ డానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరిత్రి దినోత్సవంను పురస్కరించుకొని ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి శ్రీనివాస్, జిల్లా భూగర్భజల అధికారి డి.ధనుంజయ్ రావు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్ఎం అండ్ వివిఆర్ ఎస్ ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సుమారు 60 మంది విద్యార్థులతో జరుగుతున్న 30 రోజులు క్రీడా సమ్మర్ కోచింగ్ ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. విజయవాడ ముస్తాబాద్ ఎడ్యుకేషనల్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, పూర్వ ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు చెస్ దిగ్గజాలు కోనేరు హంపి ,పెంటేల హరికష్ణ ,ఎం.ప్రియాంకలకు శిక్షణలో కీలక పాత్రధారి అయిన బొబ్బ వీరభద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చెస్ క్రీడ విశిష్ట ప్రయోజ నాలను తెలియజేశారు. మేధస్సు పెంచుకోవడానికి మానసిక నియంత్రణ వ్యక్తిగత గుర్తింపుకు చెస్ దోహదం చేస్తుందని వివరించారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారుళ్ళ వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్ జిఇసి ఫిజికల్ డైరెక్టర్ ఎం శివశంకర, ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, వైస్ ప్రిన్సిపల్ సత్యబాబు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల టిడిని మాజీ అధ్యక్షులుకొసరాజు వేంకటాద్రి చౌదరి (డాక్టర్ బాబు) 7వ వర్ధంతి సందర్భంగా కొసరాజు వేంకటాద్రి చౌదరి సేవా సమితి అధ్యక్షులు కొడాలి రామరాజు ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బాబు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటాద్రి చౌదరి తెలుగుదేశం పార్టీకి చేసిన కృషిని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహన్ రావు , గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవికుమార్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చిట్టిబాబు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్థానిక టెంపుల్ కాలనీకి చెందిన ఎండి సుభాని, జరీనా దంపతులకు 10 రోజుల క్రితం ఒక పాప జన్మించగా రక్తంలో ఇన్ఫెక్షన్, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా అత్యవసర చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే ఆ కుటుంబం అప్పులు చేసి సుమారు 4 లక్షలు ఖర్చుపెట్టారు. అయినప్పటికీ పాప పూర్తిగా కోలుకోవడానికి ఇంకో 3 లక్షలు అవసరం అని తెలిసి సాయం కోసం మైత్రి ఫౌండేషన్ ను సంప్రదించగా ఫౌండేషన్ సభ్యులు, దాతలు బాధిత కుటుంబ స్నేహితులు మొత్తం అందరూ కలిసి లక్ష రూపాయల విరాళాలు సేకరించి మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల జగన్నాథరావు చేతుల మీదగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె. వేణుకుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, సెక్రెటరీ రాధా కష్ణ, జాయింట్ సెక్రెటరీ దీప్తి, పాల్గొన్నారు.

సోలార్‌తో భవిష్యత్తరాలకు విద్యుత్ ఆదా



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సోలార్ విద్యుత్ వినియోగంతో భవిష్యత్తు తరాలకు విద్యుత్ ఆదా అవుతుందని ఏపీసీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరరావు అన్నారు. మంగళవారం సింగలూరులో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించేందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజి, తమ శాఖ ఈఈ ఎం.సత్యానందం ఆదేశాల మేరకు గ్రామాల్లో సోలార్ విద్యుత్‌పై అవగాహనా సదస్సులను చేపట్టి....ఆ కనెక్షన్లను అందిస్తున్నామని ఈఈ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పల్లెల్లో అంతా కేవలం సోలార్ విద్యుత్ వెలుగులనే చూడనున్నామని చెప్పారు. సోలార్ విద్యుత్ వినియోగంతో కేవలం సబ్సిడీయే కాకుండా గతంలో వలె పాత పద్ధతిలో కరెంట్ బిల్లులు ఇకపై ఉండవన్నారు. బిల్లుల ఆదానే కాకుండా సోలార్ ద్వారా వినియోగించుకోగా వచ్చిన మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపటంతో ఆదాయ వనరులు వినియోగదారులకు సమకూరతాయన్నారు. సింగలూరు గ్రామాన్ని నూరు శాతం సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా మార్చేందుకు ప్రతి ఒక్క ఇంటికి సోలార్ ప్యానెల్స్‌తో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీ టి.కిరణ్‌బాబు, లైన్‌మెన్ కె.సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ బహూకరణ

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని తేలప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-2002 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా జరిగింది. తమకు విద్య నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాల అభివద్ధి కావాలని కోరుతూ పూర్వ విద్యార్థులు తమవంతుగా 40వేల రూపాయల విలువ కలిగిన ఇన్వర్టర్ ను, మొబైల్ మైకును బహు కరణ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వివి ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఖాళీ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో రెండు నుంచి 8 తరగతి వరకు ఖాళీగా ఉన్న ఎస్సీ, ఓబీసీ సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో విద్యాలయ పనివేళల్లో సంప్రదించి దరఖాస్తులను స్వీకరించి వాటిని పూర్తి చేసి తిరిగి విద్యాలయంలో ఏప్రిల్ 29 లోగా సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో విద్యాలయంలో సంప్రదించాలి అని ఆయన కోరారు.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 4వ తేదీన నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షకు చేపట్టవలసిన ఏర్పాట్ల పై మంగళవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షకు సుమారు13 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. మే 4వ తేదిన ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని పరీక్ష నిర్వహణకు నగర పరిధిలో 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాగునీరుకు ఇబ్బంది లేకుండా చూడాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష వ్రాసేందుకు వీలుగా ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను ముందస్తు పరిశీలన చేయాలని జిల్లా కలెక్టరు లక్ష్మీశ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, సిటీ కో-ఆర్డినేటర్ ఎస్.అదిశేష శర్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



ప్రజాశక్తి-మైలవరం: స్థానిక ఎల్బీఆర్ సీఈ ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు పలు రకాల వృక్షాలను నాటారు. అనంతరం ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ భవిష్యత్తును సంరక్షించాలంటే ప్రకృతి పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ షాహిదా నిలోఫర్, డాక్టర్ వి భాగ్యలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మలబార్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అక్షయ తృతీయ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'డివైన్' అనే ప్రత్యేకమైన బ్రాండ్ కింద 'తన్విక' అనే కొత్త ఆభరణాల సేకరణను ఆవిష్కరించింది అని మలబార్ షోరూం మార్కెటింగ్ మేనేజర్ కాశీం తెలిపారు. ఎంజీ రోడ్ నందు గల మలబార్ షోరూంలో మంగళవారం అక్షయ తృతీయ ప్రత్యేక ఆభరణాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భ క్తి స్ఫూర్తిని జరుపుకునే డిజైన్లతో ఈ ఆభరణాలు రూపొందించబడ్డాయి. అన్నారు శ్రేయస్సు కొత్త ఆరంభాల శుభదినంగా అక్షయ తతీయ పర్వదినం, అపారమైన సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. అన్నారు .సాటిలేని విలువ మరియు కాలాతీత డిజైన్లను అందించడం ద్వారా, మలబార్ గోల్డ్, డైమండ్ కు మంచిపేరు ఉందని అన్నారు. ప్రతి ఏటా అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అంగన్వాడీ స్కూళ్లకు సెలవులు ప్రకటించాలి



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం మహేష్ మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలలకు ఎండల తీవ్రత రీత్యా తక్షణమే వేసవి సెలవులు ప్రభుత్వం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి సమస్యల పరిష్కారానికి పెరిగిన ధరలు వైద్య విద్య ఖర్చుల రీత్యా జీతాల పెంపు చేయాలని,సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, మినీ సెంటర్స్ మెయిన్ సెంటర్స్ మార్పు చేయాలని, పిఎఫ్ ఈఎస్ఐ లాంటి చట్టబద్ధ సౌకర్యాలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కి ఇవ్వాలని , హెల్త్ బెనిఫిట్స్ ప్రకటించాలని, గర్భిణీ స్త్రీలకు చిన్నపిల్లలకు ఆహార పోషణకు నిరంతరం శ్రమించే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సెక్టార్ లీడర్ కే బుల్లెమ్మ ఈలప్రోలు సెక్టార్ లీడర్ నిర్మల, కేతనకొండ సెక్టార్ లీడర్ రబ్బాని అంగన్వాడీ వర్కర్స్ ముంతాజ్, నాగలక్ష్మిపి నిర్మల, అచ్చమ్మ అలివేలు, శాంతి శ్రీ, జ్యోతి, అరుణ, కృష్ణకుమారి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ తాతయ్యను కలిసిన రైతులు

ప్రజాశక్తి-నందిగామ: జగ్గయ్యపేట ఎంఎల్ఎ తాతయ్యను శనగపాడు సప్లై ఛానల్ కాలవ నందిగామ అనాసాగరం శనగపాడు ఆయకట్టు రైతులు మంగళవారం కలిశారు. గత నెల కాలువకు నీరు అందకపోవటంతో దాల్వా పంట కు నీరు అందక ఇబ్బంది కలిగిందని ఎమ్మెల్యేకు వివరించారు. పోలంపల్లి ప్రాజెక్టు నుంచి తక్షణమే రైతుల అవసరాల మేరకు శనగపాడుసప్లై ఛానల్ కాలువకు తక్షణమే నీళ్లు విడుదల చేయాలని కోరారు. దాలవా పంట కు నీరు అందటంతో రైతులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు యేచూరి రాము, నీటి సంఘం అధ్యక్షులు చలమల కృష్ణ, ఇంటిమల ఆనంద్ , దుగ్గిదేవి గోపికృష్ణ అనాసాగరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీపై సదస్సు



మాట్లాడుతున్న వెంకటరావు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఈ నెల 23న బుధవారం విజయవాడలో ఆటోనగర్లో ఏపి ఎంఎస్ఎంఇ ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్, ఫైనాన్సింగ్, పని మరియు ఆపర్చునిటీస్ అనే అంశంపై వర్క్షాపు నిర్వహిస్తున్నట్లు ఏపి ఎంఎస్ఎంఇ గౌరవాధ్యక్షులు బాయన వెంకటరావు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఏపి ఎంఎస్ఎంఇ కార్యాలయ ప్రాం గణంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఒక వ్యాపారవేత్త వుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్. గౌరవ అతిథిగా తమ్మిరెడ్డి శివ శంకర్ రావు, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ లు పాల్గొంటారన్నారు. సంస్థ డా శేఖర్ బాబు గద్దం, ఐఎఫ్ఎస్ ముఖ్య అంశాలను ప్రస్తావిస్తారన్నారు. సాంకేతిక అంశాలపై బెస్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ఎండి ముమ్మడి శేషసాయి, జీఎం ముమ్మడి పవన్ కుమార్లు ప్రసంగిస్తారన్నారు. హైదరాబాద్ లోని బెస్ట్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ వారితో కలిసి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్స్ అందరూ పాల్గొని అదేవిధంగా వారి వారి ప్రయారిటీ యొక్క ఇండస్ట్రీ వ్యయం, రుణసంపాయం,సబ్సిడీ, వాటి వివరాలను పూర్తిగా వివరించే విధంగా ఏర్పాట్లు, అదేవిధంగా నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే ప్రతివారు అధిక లాభాలను పొందే స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ రకరకాల వ్యాపారాల గుర్చి వివరిస్తారని మరియు, ఉన్న వ్యాపారాన్ని ఎస్టాబ్లిష్ చేయటం, ఇటువంటి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఈ అవగాహన సదస్సులో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సినాప్స్ ఒలింపియాడ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సినాప్స్ ఒలింపియాడ్ తరపున రెండో వార్షిక అవార్డుల ప్రదాన కార్యక్రమం బెంజ్‌సర్కిల్ సమీపంలోని కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం హాలులో మంగళవారం జరిగింది. సౌత్ కోస్టల్ జోన్స్ అన్ని కలిపి ఆల్ ఇండియా టాప్ టెన్ మెరిట్ ర్యాంకు విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాన్ ఇండియా సినాప్స్ లీడ్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ 50 స్కూల్స్ నుంచి ఆల్ ఇండియా టాపర్స్‌ను పిలిచి, వారికి అవార్డులు ఇస్తున్నామని అన్నారు. రెండో ఏడాది తాము ఈ వార్షిక అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ రీజియన్ లో ఇది మొదటి వార్షికోత్సవం అని చెప్పారు. ఈ సందర్భంగా టాప్ ర్యాంకర్లను అభినందించడంతో పాటు వారికి సహకరించిన అకడమిక్ టీం కు, ప్రిన్సిపల్స్ కు అభినందనలు తెలిపారు. ఆర్ అండ్ డి హెడ్ వాణి చౌదరి మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల పై నమ్మకంతో తమకు సహకరిస్తూ, మద్దతునిస్తున్న తల్లిదండ్రులకు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న నరేంద్రకుమార్

కృతజ్ఞతలు తెలిపారు. మున్ముందు రోజుల్లో కూడా ఇదే సహకారాన్ని కోరుతుకుంటున్నామని చెప్పారు. సినాప్స్ పరీక్షకు పదివేల మంది విద్యార్థులు పాల్గొంటే సౌత్ కోస్టల్ నుంచి 746 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అన్నారు. ఇది గొప్ప విజయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఫాతిమా, ఏజీఎం మురళి కిషోర్, ఎజీఎం రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న దేవదత్

ప్రజాశక్తి-రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండలం కొత్త నాగులూరు గ్రామంలో 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ చైర్మన్ సేవల దేవదత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 రకాల పిఎండిఎస్ విత్తనాలు చల్లుకొని భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకోవడం ద్వారానే అధిక దిగుబడులు సాధించుకుంటారన్నారు. రసాయన వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందులు వాడిన రైతులకు ఎకరాకు పది నుంచి 15 వేలు వస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు.. ప్రకృతి వ్యవసాయం చేసుకోవడానికి ఆవుల అవసరమైన రైతులకు ఆవులు ఇప్పించి వ్యవసాయం చేసుకునేందుకు ప్రోత్సహిస్తానన్నారు.రైతులు పండించిన పంటలను ఎఫ్ పి ఓ ద్వారా మార్కెటింగ్ చేసుకొని అధిక లాభాలు పొందవచ్చని వ్యాఖ్యానించారు. నేల పరీక్షలు చేసుకొని ఆ నేలకు అనుగుణమైన పంటలు పండించాలని రైతులను కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేసే వారికి సర్టిఫికెట్ ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను పి ఎం డి ఎస్ వేస్తానన్న రైతులకు 30 రకాల విత్తనాల పీఎండీఎస్ కిట్లు రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు, మండల వ్యవసాయ అధికారి సురేష్, ఎంటిఎల్ మహేష్ నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



క్రీడా మైదానం ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం లింగాలపాడు గ్రామం లో 4 లక్షల 25 వేల రూపాయల అంచనాతో పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అభివృద్ధిపరచిన క్రీడా మైదానాలను విద్యార్థిని విద్యార్థులు స్కూల్ యాజమాన్యం , కూటమి నేతలతో ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం, క్రీడలు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని తంగిరాల సౌమ్య తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి విద్యా కిట్లను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోపల పాఠశాలలకు అందుతాయని తెలిపారు.విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న 6,7,8,9 తరగతుల విద్యార్థిని విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులను స్కూల్ యాజమాన్యంతో కలిసి పంపిణీ చేశారు. తరగతి వారీగా ప్రథమ ద్వితీయ తతీయ స్థానం పొందిన విద్యార్థి విద్యార్థులను తంగిరాల సౌమ్య అభినందించారు.పాఠశాల ఇతర అవసరాలు అభివృద్ధికి తన కృషి చేస్తానని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామి పాల్గొన్నారు.

అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఒకటో వార్డు మూడో సెంటర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీ భార్గవి మరియు ఎసిడిపిఓ నాగమణి ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి నుండి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించే కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆలేటి జ్యోతిరాణి, ఎస్ పద్మజ శ్రీ, కె.నాగలక్ష్మి, షేక్ నగీన, ఎం మహాలక్ష్మి తిరుపతమ్మ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నందిగామ: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తహనుమేశ్వరరావు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో 108 కలశ సుగంధ ద్రవ్యాలతో స్నాపన, చందన అలంకరణ సేవ, కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారిని పెళ్లి కుమారుని చేయటం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఉపాధి కార్మికులకు 200 రోజుల పనిదినాలు కల్పించాలి


ఉంగుటూరు మండలంలో మాట్లాడుతున్న నరసింహారావు

- క్షేత్రస్థాయిలో కార్మికుల సమస్యలు తెలుసుకున్న నాయకులు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై నరసింహారావు అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు జనవరి నుండి వేతన బకాయిలు చెల్లించడం లేదని కూలీలు నాయకుల దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఉపాధి పనికి సంబంధించి పనిచేసిన 15 రోజులలో కూలి చెల్లించాలని చట్టంలోఉందని, అదేవిధంగా పని కావాలని నమోదు చేసుకున్న 15 రోజులలో పని చూపించాలని, పని చూపించని పక్షంలో 16 వ రోజు నుండి సగం వేతనం చెల్లించాలని చట్టం చెబుతోందన్నారు. పని ప్రదేశాల్లో మంచినీరు, ఓఆర్ఎస్ పాకెట్స్ సరఫరా చేయాలని, టెంట్ లు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఈ విధమైన కనీస అవసరాలు తీర్చడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి వి రామ్మోహన్ రావు, రైతు సంఘం నాయకులు మాగంటి సాంబశివరావు, చౌటుపల్లి ప్రభాకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మంచినీరు, షామియానా తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, పని చేసిన కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మంగళవారం మొవ్వ మండలం కాజ పంచాయితీలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొడాలి కరుణాకర్ రావు, కొడాలి శ్రీనివాసరావు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** పెంచిన వేతనాలు అమలు చేసి, మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ డిమాండ్ చేశారు. గన్నవరం మండలం చనుపల్లివారి గూడెంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం నిర్ణయించిన 300 రూపాయల వేతనం ఇవ్వడం లేదని 200 నుండి 230 వరకు మాత్రమే వేతనం వేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, తాతబ్బాయి రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పంచకర్ల రంగారావు మాట్లాడి వాళ్ళ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కంకిపాడు మండల ఉపాధ్యక్షులు టి నరేష్ కూడా పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల (చల్లపల్లి) :** చల్లపల్లి మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులతో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు యద్దనపూడి మధు మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు రావటం లేదని కూలీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మహమ్మద్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల :** మండల పరిధిలోని ఘంటసాలపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మేడంకి వెంకటేశ్వరావు, వాకా రామచంద్ర రావు, గోరుముచ్చు వెంకటేశ్వరావు మంగళవారం పరిశీలించి ఉపాధి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు రెండు నెలలనుండి వేతనాలు బకాయిలు ఉన్నాయని, 100 రోజులు పని కల్పించటం లేదని ఆవేదన సమస్యలను నాయకులకు తెలిపారు.



మొవ్వ మండలంలో...


గన్నవరం మండలంలో...


చల్లపల్లి మండలంలో...


కంకిపాడు మండలంలో...

30 లోగా ఇకెవైసి చేయించుకోవాలి


పమిడిముక్కలలో మాట్లాడుతున్న తహసీల్దార్ నవీన్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రభుత సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు రేషన్ కార్డులోని ప్రతిఒక్క స భ్యుడు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించు కోవాలని ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ తెలిపారు. రెవిన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 20,706 (ఐదేళ్ల కంటే తక్కువ వయ సు ఉన్నవారు,80ఏళ్ల పైబడినవారు మినహాయించి) రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించ వలసి ఉందన్నారు. ఈ-కేవైసీ చేయించని వారి పేర్లు సంబంధిత ఎం డీయూ/ రేషన్ షాప్ డీలర్ల వద్ద, పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు, తహసీల్దార్ల వద్ద ఉంచామన్నారు. బియ్యం కార్డు కలిగిన ప్రతివారు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి కాని వారు ఈనెల 30వ తేదీలోగా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** తెల్లరేషన్ కార్డు ఉన్న వారు 30వ తేదీలోపు చేయించుకోవాలని పమిడిముక్కల మండల తహసీల్దార్ నవీన్ అన్నారు. మంగళవారం తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : వందలాదిమంది పేద మధ్యతరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్న ఆపద్బాంధవుడు చంద్రబాబు అని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో 11వ వార్డుకు చెందిన వాస అనుదీపికకు రూ.60వేలు, గుడివాడ రూరల్ మండలం బిళ్లపాడుకు చెందిన అశ్వద్ధతి వరసంధ్యకు రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్‌కి సంబంధించిన ఎల్‌ఓసి చెక్కును అందించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహన్ రావు, రాంబాబు, నాయకులు సయ్యద్ జబీన్, షేక్ మౌలాలీ, షేక్ కరీముల్లా, పట్టపు చిన్న పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికలు అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : డా. బిఆర్ అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు కెయు ఉపకులపతి ఆచార్య కె రాంజీ, రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. శేషా రెడ్డి, డా. స్వరూపా లు పాల్గొన్నారు.



తెలంగాణ మంత్రి రాజనరసింహను కలిసిన దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక రాజేంద్ర నగర్ లోని ఒక ప్రైవేట్ కార్యాక్రమానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు రాజనరసింహాను మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు కంచర్ల సుధాకర్, పొంగులేటి జయరాజు, అద్దంకి మాణిక్యాలరావు, కలపాల బాబూరావు, కోదమల గంగాధర్, దొండపాటి రాంబాబు, అప్పికట్ల ఆడమ్ స్మిత్, తదితరులు పాల్గొన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యార్థులు ప్రతిభ ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. అవనిగడ్డ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికలను మంగళవారం ఎంఎల్ఏ తన కార్యాలయంలో సత్కరించారు. ఇంటర్ సెకండియర్ ఫలితాలలో ఎంపీసీ విద్యార్థిని నాయుడు శ్యాం లీల 1000 మార్కులకు 968 మార్కులు సాధించగా బైపిసి విద్యార్థిని కైతేపల్లి మేఘన సంధ్య 1000 మార్కులకు 954 మార్కులు సాధించగా ఆరెవరపు సాయి నవ్య శ్రీ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 420 మార్కులు సాధించగా వారిని బుద్ధప్రసాద్ సత్కరించి



జ్ఞాపికలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం అధికారి ఎం మంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు

ఐనంపూడి డ్రైనేజీపై వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి మొవ్వ : మొవ్వ మండలం కాజా గ్రామంలో ఐనంపూడి డ్రైనేజీపై ఉన్న ఐరన్ వంతెన పూర్తిగా తుప్పు పట్టి శిథిలమై ప్రమాద భరితంగా ఉంది. వంతెన శిథిలమై సంవత్సరాలు గడుస్తున్న గత, ప్రస్తుత పాలకులకు చీమ కుట్టినట్టు లేదు. నిత్యం మొవ్వ టు మచిలీపట్నం రవాణా ఈ వంతెన మీద జరుగుతోంది. మొవ్వ నుండి మచిలీపట్నం వరకు గల గ్రామాలకు ఏకైక రహదారి. పాత వంతెన శిథిలమై ఒకవైపు ఉంటే మరొకవైపు రన్నింగ్‌లో ఉన్న ఐరన్ వంతెన కూడా శిథిల మైంది. మంగళవారం కాజా గ్రామంలో శిథిలమైన వంతెనను స్థానిక ప్రజానీకం తో కలిసి సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మండల నాయకులు పరిశీ లిం చారు. వెంటనే వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.


పాడైన వంతెనను చూపిస్తున్న ప్రజలు

పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మనుగడ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: భావితరాల కోసం పర్యావరణ జాగ్రత్తలు పాటించకపోతే చముదుసంక్షోభం తలెత్తుతుందని, జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పిజి స్టడీస్ (నూజివీడు) డాక్టర్ జె. నవీన లావణ్యలత అన్నారు. మంగళవారం విజయవాడలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం, గ్రీన్ క్లబ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ ధరిత్రీ దినోత్సవంలో ముఖ్య అతిథిగా లావణ్యలత పాల్గొన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ పర్యావరణహితమైన వస్తువులనే మనం కొనుగోలు చేయాలని సూచించారు. విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ దీక్షపూనాలన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులకి డా. నవీన లావణ్యలత జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.మనోరంజని, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఎనలిస్ట్ జి.ప్రసన్న, ఫిజిక్స్ విభాగాధిపతి డా.టి. ఎస్.కృష్ణ, అధ్యాపకులు పాండురంగారావు, ముస్సరీన్, తస్లీం, ఎన్.రాజశేఖర్, విజయకృష్ణ, పూజిత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లావణ్య లత



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కనకదుర్గ

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి-మైలవరం: ఐటీ, ఐటీఈ ఎస్, ఎలక్ట్రానిక్స్ లో ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి అనిమిరెడ్డి గవర్నమెంట్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం సమగ్ర శిక్షఅందించిన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో కంప్యూటర్ రంగం ఒక భాగం కావాలని భవిష్యత్తు అంతా సాఫ్ట్వేర్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ రంగమేనన్నారు. ఈ రంగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం వల్ల చదువుతోపాటు నత్యవిద్యాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు ఎం చెన్నారావు, సిహెచ్ ఆశ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో శరత్‌చంద్ర అకాడమీకి ర్యాంకులు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: 2025 యుపిఎస్సి సివిల్స్ ఫలితాలు లో నగరంలోని శరత్ చంద్ర ఐ ఏ ఎస్ అకాడమీ కి జాతీయ స్థాయి ర్యాంకులు వచ్చాయని సంస్థ డైరెక్టర్ తోట శరత్ చంద్ర తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయం నందు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. తమ విద్యార్థులు శ్రవణ్ కుమార్ కు 62వ ర్యాంకు, చైతన్య జాదవ్ కు 68వ ర్యాంకు, చిన్నం రెడ్డికి 119 వ ర్యాంకు, అలాగే మరెన్నో ర్యాంక్స్ సాధించారని హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా అనన్య రెడ్డికి మూడవ ర్యాంకు, రుహానికి ఐదవ ర్యాంకు అలాగే మరెన్నో ర్యాంకులు వచ్చాయని తెలియజేశారు. తెలుగు విద్యార్థులు యూపీఎస్సీ సివిల్స్‌లో రాణించడం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన అభ్యర్థులు, మహిళా అభ్యర్థులకు మంచి ర్యాంకులు వచ్చాయి అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.



ఆర్‌టిసి కాలనీలో తాతయ్య పర్యటన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ఇతర కౌన్సిల్ సభ్యులు, ఇతర నేతలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులోని ప్రధానంగా సిసి రోడ్లు, డ్రైనేజీలు, ప్రధానంగా కరెంటు సమస్యలు ఉండటంతో ఎలక్ట్రికల్ ఏడీ మరియు సిబ్బంది వారిని పిలిపించి కొన్ని సమస్య వెంటనే అక్కడ పరిష్కరించి మిగిలిన ఎలక్ట్రికల్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు అదేవిధంగా వేపల వాగు ను పరిశీలించి దానిని త్వరలోనే ప్రక్షాళన చేస్తామని వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, యామర్తి బోస్ యాదవ్, పూసల పుల్లారావు, ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వర రావు, వేదులాపురి సైదా, చిలుకూరి కార్తీక్, కొత్త నాగరాజు, మౌలాలి మరియు కమిషనర్ రామ్ మోహన్‌రావు, సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఏ తాతయ్య

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పట్టణ మున్సిపల్ కార్మికుల ఉద్దేశించి ఎన్సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కార్మికులకు కాంట్రాక్టర్లు వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా కట్టని పరిస్థితి ఉండేదన్నారు. పని నుండి తొలగించేవారన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేయద్దన్నారు. ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ కార్మికులకు నైపుణ్యాన్ని బట్టి వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు పారా యలకమ్మ, సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్

సివిల్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ నందు మంగళవారం నాడు "ప్రతిభా" సివిల్స్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు సివిల్స్, గ్రూప్-1, 2 ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా సంపాదించాలో అనే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్‌లు వి రాధాకృష్ణారెడ్డి, వి కోటిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లీలావతి గిరిజన పాఠశాల 42 వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థి సత్ప్రవర్తనకు తోడ్పడుతుందన్నారు. గత 42 సంవత్సరాలుగా ఈ పాఠశాలలో చదివిన విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. అనంతరం పాఠశాలలో జరిగిన సైన్స్ ఫెయిర్, చదువులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జంజనం రాధా కుమారి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి-వత్సవాయి: గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీ భార్గవి అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని తోట చర్ల గ్రామంలో ఎసిడిపిఒ నాగమణి ఆదేశాల మేరకు గ్రేడ్ వన్ సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో బాలబాలికలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం గురించి, ఏఎన్ఎం గాయత్రి గర్భిణీల ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు ఆవశ్యకత గురించి తెలిపారు. తోటచర్ల మండల పరిషత్తు ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా ఐదు సంవత్సరం వరకు అంగన్వాడీలో ఉచిత విద్యను అభ్యసించిన చిన్నారులను స్కూల్లో జాయిన్ చేశారు.

మధ్యాహ్న భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో 16.44 లక్షలతో నిర్మించిన మధ్యాహ్న భోజనశాలను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అల్ట్రాటెక్ యూనిట్ హెడ్ శివరాజ వరద రాజన్, యూనిట్ హెచ్ ఆర్ హెడ్ జి.మోహనరావులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్ట్రాటెక్ ప్రతినిధులు జిఎవి గిరిబాబు, ఆర్ జనార్ధన్‌రావు, రాజేష్, స్కూల్ హెచ్ఎం వాణి, ఎస్ఎంసి చైర్మన్, గ్రామ టిడిపి అధ్యక్షులు షేక్ సుభాని, మెట్టెల రమణ, షేక్ నాగుల్‌మీరా, కమలేష్, బడేమియా, బాషా, సుధాకర్, వాసుదేవరెడ్డి, ముల్లంగి మధు, స్కూల్ చైర్మన్ అప్పారావు, నాగులు, అన్నెపాగ పవన్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : లక్ష్మణరావు


మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి-కంకిపాడు

నేడు భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై అబ్దుల్ కలాం స్టడీ సర్కిల్ విజ్ఞాన వేదిక పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు అమరయ్య శాస్త్రి అధ్యక్షతన మంగళవారం స్టడీ సర్కిల్లో స్టడీ సర్కిల్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కొలీజియం కమిటీ దాదాపు 60 దేశాల రాజ్యాంగాలను చూచి అందులోని సారాంశాలను తీసుకొని మన దేశంలో ఉన్న భిన్నత్వానికి రాజ్యాంగాన్ని రచించారన్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి ముప్పు, సమైక్యవాదానికి ఏర్పడుతున్న ఆటంకం, డి లిమిటేషన్ పై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదనలు, దక్షిణాది రాష్ట్రాల నాయకులు చేస్తున్న వాదనలు ,నిజాలు,పరిష్కారాలు, మరియు న్యాయవ్యవస్థ నేడు ఎదుర్కొంటున్న సవాళ్లు , ప్రభుత్వాదినేతల చేతుల్లో న్యాయవ్యవస్థ ఏ విధంగా కు నారీల్లిపోతుందో సాదోహరణంగా వివరించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. అబుల్ కలాం స్టడీ సర్కిల్ విజ్ఞాన వేదిక నిర్వాహకులు శాస్త్రి, పోరంకి విజ్ఞాన్ భారతి స్కూల్ డైరెక్టర్ రమేష్ నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి త్రిమూర్తులు, ప్రజానాట్యమండలి కృష్ణా జిల్లా కార్యదర్శి షేక్ ఖాసిం,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పెనమలూరు మండల కమిటీ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి ,మహిళా సంఘం పెనమలూరు మండల కార్యదర్శి పి పాతాళ లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రజాశక్తి - గుడివాడ : విద్యార్థులు కృషి, పట్టుదల, అంకిత భావంతో పనిచేయడం నేర్చుకోవాలని ఎఎన్ఆర్ కళాశాల కార్యదర్శి కె.ఎస్. అప్పారావు సూచించారు. మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాల 2023-25 బ్యాచ్ ఎం.బి.ఎ. విద్యార్థుల వీడ్కోలు సభను ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు ఎల్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను ఎన్నడూ మరువ కూడదని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను సాధించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాని ఉపయోగించుకొని వ్యాపార వేత్తలుగా ఎదిగి దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ మాట్లా డుతూ విద్యార్థులు జీవితంలో ఏర్పరచుకున్న లక్ష్యాలను క్రమ శిక్షణతో సాధించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని, విద్యార్థులు నత్య ప్రదర్శనాలతో అందరిని ఆకట్టుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.బి.ఎ. డిపార్ట్మెంటు విభాగాధిపతి డాక్టర్ ఎం.బి.సువర్చల, ఎం.బి.ఎ. అధ్యాపకులు పాల్గొన్నారు.